
# అనుకున్నదొక్కటి అయినదొక్కటి

-యం.సి.శివశంకరశాస్త్రి



అదో పల్లెటూరు.

కరువు కాటకాల కాణాచి రాయలసీమలో వెనుకబడ్డ జిల్లా అనంతపురం పట్టణానికి దాదాపు ముప్పయి కిలోమీటర్ల దూరాన కొండగుట్టల్లో ఉందా పల్లెటూరు.

అటు పదేళ్ళ క్రితం బయల్పడిన నాపరాళ్ళ గనుల్లోను, తద్వారా చోటు చేసుకున్న పాలి షింగ్ మిష న్లలోను కూలీ నాలి చేసుకు బతికేందుకై వలసొచ్చి చేరిన జనంతో ఆ ఊరి జనాభా బాగా పెరిగి పోయింది. జనావళి రాకపోకల సౌకర్యార్థం రోజూ నాల్గు ట్రిప్పులు తిరుగుతోంది ఆర్టీసీ ఎర్రబస్సు. పెరిగిన జనాభా ఆకలిదప్పులు తీర్చే నెపంతో చిన్న చిన్న టిఫిన్ సెంటర్లు, బీడీ సిగరెట్టు బడ్డీ కొట్లు కూడా చోటుచేసుకున్నాయ్.

ఊరినానుకుని గడ్డివామి దొడ్లకీవల ఉన్న పుల్లమ్మ "టీ - టిఫిన్ స్టాల్"కున్న గిరాకీ అక్కడి మరే టీ స్టాల్‌కీ లేదనే చెప్పుకోవాలి. జనమంతా పుల్లమ్మ టీస్టాల్ దగ్గరే బస్సెక్కి దిగుతూండటంతో అదే ఆ ఊరి బస్టాండుగా స్థిరపడిపోయింది.

పుల్లమ్మ టీ - టిఫిన్ స్టాల్‌లో ఓ పాత చెక్క బల్లమీద కూలీ జనానికి అందుబాటులో ఉండే రకరకాల చౌకబారు బిస్కట్లు, నాన్ రొట్టెలు, వాటికి కొద్ది యెడంగా అల్యూమినం డేక్షాలలో మిరపకాయ బజ్జీలు, బొరుగులు తడిపి తయారుచేసిన పులిహోర టైప్ ఉగ్గాణి వగైరాలు నోరూరేలా కనిపించేట్టు పొందికగా అమర్చబడి ఉంటాయి.

బల్లనానుకుని ఓ స్టూల్ వేసుక్కూచునుంటుంది ప్రొప్రయిటరు పుల్లమ్మ. ఆమె సీటుకు అటుపక్క చిన్న సెగమీద ఓ కెటిల్‌లో టీ కాగుతూ ఉంటుంది. మరోపక్క చక్కగా అమర్చిన చెక్క అలమారులో బీడీ కట్టలు, సిగరెట్ ప్యాకులు కనబడు తూంటాయి. ఆ టీ స్టాల్ ఆదాయం ద్వారా ఆ కుటుంబ ఖర్చు కందాయాలన్నీ సాఫీగా సాగిపో తుంటాయి.

* * *

పది నెలలక్రితం ఆ ఊరికి బదిలీపై ఎలిమెంటరీ స్కూల్ టీచర్ నాగయ్య ప్రతిరోజూ పట్నం నుంచీ వచ్చి బస్సు దిగగానే తిన్నగా టీ స్టాల్‌లోకి దూరి నవ్వులు చిందిస్తూ పుల్లమ్మని పలకరించి ఆమె చేతులమీదుగా ఓ ప్లేట్ వేడి వేడి మిర్చీ బజ్జీ అందుకుని ఆరగించాక లొట్టలేసుకుంటూ టీ తాగుతూ సూటిగా ఆమె కళ్ళల్లోకి అదోలా చూస్తూ కాసేపు కాలయాపన చేసిన మీదటే స్కూలు కెళ్ళడం అతనికి బాగా అలవాటయిపోయింది. వ్యాపార ధర్మంగా ప్రతిఒక్కళ్ళనీ నవ్వుతూ పలుకరించి టిఫిన్ సెంటర్ గిరాకీ పడిపోకుండా జాగ్రత్తగా చూసుకుంటోంది పుల్లమ్మ.

పుల్లమ్మ వయసు మూడు పదులుండవచ్చు. రమణీయమైన రామప్ప శిల్పానికి ప్రతిరూపంగా ఉండే బ్లాక్ బ్యూటీ పుల్లమ్మ ముగ్గురు పిల్లల తల్లయినా చూడ చక్కగా ఉంటుంది. ఆమె నవ్వుల గల గలలకు ఎవరైనా బిత్రుతప్పి నీళ్ళు చప్పరించి అబ్బిళ్ళు కొరక్క మానరు.

రోజూ పుల్లమ్మని నవ్వుతూ పలకరించే నాగయ్య మాష్టారుకి ఆమె అంటే అదోరకమయిన ఇది పెరిగిపోయింది. వచ్చినప్పుడల్లా ఏవేవో కబుర్లు దంచి పడేసి అతి కష్టంగా అక్కణ్ణుంచి బడి చేరుకునేవాడు. అయ్యగారి విచిత్రధోరణికి గమ్మున లోలోన నవ్వుకునేది పుల్లమ్మ

* * *

దసరా సెలవుల తర్వాత స్కూల్ రీఓపెన్ అయింది. ఆ రోజు నాగయ్య మాష్టారు బస్సు దిగగానే టీ స్టాల్‌లోకి వెళ్ళిపోయి ఎప్పటిలాగే మిర్చీబజ్జీ లాగించేసి టీ తాగుతూ పుల్లమ్మని పచ్చికొబ్బరి ముక్కలా నమిలేద్దామా అన్నంత కోరికతో చూస్తూ మాటల్లో ద్వందార్థపు మాటలు విసిరేడు. అందుకామె గమ్మునుం డేకాని ఏమీ అనలేదు. దాని నాసరాగా తీసుకొని తనని ప్రేమించి గ్రీన్ సిగ్నల్ ఇవ్వటానికి ఆమె సిద్ధంగా ఉందని ఊహించేసుకున్న నాగయ్య 'పుల్లమ్మని వలలో వేసుకోవడమెలా?' అని ఆరోజు రాత్రి బాగా పొద్దు పోయే దాకా ఆలోచించాడు. తళుక్కున బుర్రలో ఓ మెరుపు మెరిసింది. వెంటనే ఓ కొత్త పదిరూపాయల నోటందుకుని వాటర్ మార్కున్న ఖాళీ ప్రదేశంలో ఎర్రరంగు రీఫిల్‌తో క్లుప్తంగా ఏదో రాసి జాగ్రత్తగా దాన్ని జేబులో దాచుకున్నాడు.

మరునాడు ఉదయం బస్సు దిగగానే టీస్టాల్‌లోకెళ్ళిపోయి నవ్వులు చిలకరిస్తూ పుల్లమ్మని పలకరించి మిర్చీబజ్జీ లాగించేసి టీ తాగేక రాత్రి ఏదోరాసి జాగ్రత్తగా పెట్టుకున్న ఆ పదిరూపాయలనోటునే ప్రత్యేకంగా బయటికి తీసి ముసి ముసి నవ్వులు రువ్వుతూ పుల్లమ్మ చేతికిచ్చేడు.

ఫెళ ఫెళమనే ఆ కొత్త పదిరూపాయల కాగితం మీద ఎర్రటి సిరాతో రాసిన అక్షరం ముక్కలు కొట్టొచ్చినట్టు కనిపించేసరికి చూసింది. "నువ్వంటే నాకెంతో ఇష్టం. ఈ రాత్రి తొమ్మిదింటికి మీ ఇంటికొస్తాను. కాదనక నా కోర్కె తీర్చు" అని రాసున్న ఆ అక్షరం ముక్కలు చదువుకుని ఆ మాష్టారుకేసి ఓసారి ఎగాదిగా చూడగానే రభసగానీ చేస్తుందేమోనన్న భయంతో తననెవరో తరుముకొస్తున్నట్టు తక్కిన చిల్లర డబ్బులు కూడా తీసుకోకుండా వేగంగా స్కూలు వేపు వెళ్లిపోయాడు.

గమ్మున నోటుని బొడ్లో దోపుకుంది.

పొద్దువాలి సూరీడు పడమటి కొండల్లోకి పరుగులు తీశాడు. అటుపై కాసేపటికి వెలుగు తగ్గింది. ఆఖరి ట్రిప్ ఆర్టీసి బస్సుకై ఓ పదిహేనుమంది దాకా టీ కొట్టు దగ్గర కూచుని ఎదురుచూస్తున్నారు. పిండారబోసినట్లు వెన్నెల్లో పుల్లమ్మ టీ స్టాల్ దగ్గర నుంచున్న కూలీజనం మాత్రం మాంచి రసపట్టులో సినిమా కబుర్లు దంచి పడేస్తున్నారు. ఆ టీస్టాల్‌కి ఎదురుగుండా కొంత దవ్వున ఉన్న వేప చెట్టు క్రింద ఏకాకిగా నుంచుని సద్దుమణుగుబాటుకై ఎదురుచూస్తున్నాడు బడిపంతులు నాగయ్య.

ఈలోగా ఆఖరి ట్రిప్ బస్సొచ్చి వెళ్లిపోయింది. ఆపై పదినిముషాల్లో సద్దుమణిగిపోయింది. అనంతరం టీకొట్టు కట్టేందుకై సిద్ధమయిన పుల్లమ్మ బయటికొచ్చి నోటవున్న వక్కాకు ఉమ్మేసి నోరు కడుక్కుంటూ వేప చెట్టు దగ్గర నుంచుని ఇటు వేపే చూస్తూన్న బడిపంతుల్ని గమనించింది.

పాడి దగ్గు దగ్గాడు.

ఓసారటు చూసి గమ్మున తలవొంచుకుని లోనికెళ్లిపోయి తలుపు బార్లా వేసింది. ఇక ఆలస్యం తగదని చుట్టూ ఓసారి కలియజూసి గబగబా వెళ్ళి బార్లావేసిఉన్న తలుపుల్ని తోసుకుని లోనికెళ్ళిపోయి పుల్లమ్మకై చుట్టూతా చూసిన నాగయ్యకి ఒక్కసారిగా గుండె ఆగినంత పనై చెమటలు పట్టేశాయి.

"రా అయ్యా! రా!! ఆ మంచం మీద కూసో" నులకమంచం చూపెట్టేడు పుల్లమ్మ మొగుడు పుల్లయ్య.

మెల్లిగా అడుగులు మంచం వేపు వేశాడు.

"సీకట్లో ఇటొచ్చారేమయ్యా? ఊరికెళ్ళలేదా?" అడిగేడతను.

గొంతులో పుల్ల అడ్డుపడ్డట్టయి నాలుక తడారిపోయింది.

"మాట్లాడవేమయ్యా?"

"బస్సు తప్పోయింది. ఈ రాత్రికిక్కడే ఉండి పొద్దుటే లేచి వెళ్ళిపోదామని ఇటొచ్చాను" నెమరు తిరగని మాట చెప్పి మెల్లిగా మంచం మీద కూలబడ్డాడు.

"అందుకే వచ్చారా? లేక మరేదయినా పనుండి గానీ...!"

ఛెళ్ళున చెంప దెబ్బ వేసి పలుకరించినంత ఇదిగా వినిపించిందీ మాట.

ఈసారి మాట పెగలక దిక్కులు చూశాడు నాగయ్య మాస్టారు.

"నువ్వు సదువుకున్నోడివి. పైగా పిల్లలకి నీతి పాఠాలు సెప్పే అయ్యవారివి కూడా. మాబోటి సదువు సందెల్లేని మొద్దు జనానికి మంచేదో, సెడేదో తెలియజెప్పాల్సిన నువ్వే పరాయి అడదానికోసం పాకులాడటం మంచిదా చెప్పు"

"ఏంటి పుల్లయ్యా మాట్లాడుతున్నావ్?"

"ఏమీ తెలీనట్లు నటించకయ్యా"

"నువ్వేమంటున్నావో ఏమోగానీ నాకంతా అయోమయంగా ఉంది" లోతైన మాతిలోంచి మాటాడితే వినిపించినట్టు వినిపించిందీమాట.

"చేసిన తప్పు బట్టబయలయినప్పుడు నేరస్తుడికి అంతా అయోమయంగానే ఉంటాది. ఏది ఏమయినా సదువు సందెల్లేనోణ్ణి నీకు బుద్ది మాటలు సెబుతూన్నందుకేమీ అనుకోక ఇక నీ నడవడికలు సరిదిద్దుకో".

"అది కాదు పుల్లయ్యా!"

"ఎందుకయ్యా ఇంకా డొంక తిరుగుడు. నువ్వు నోటు మీద రాసిన ఈ రాత నలుగురికీ సూపెడితే నీ పరువేమవుతాదో బాగా ఆలోసించుకో" ఉదయం పుల్లమ్మకి అతడిచ్చి వెళ్లిన ఆ పదిరూపాయల నోటు బనీను జేబులోంచి తీసి నాగయ్య ముందుకి విసిరేశాడు పుల్లమ్మ మొగుడు.

చెవులు దిమ్మెక్కి కళ్ళు బైర్లు గమ్మాయి. లేవబోయి మళ్ళీ మంచంమీదే కూలబడిపోయాడు.

"రేపు పొద్దున్న ఈ ఊళ్ళో దండోరా యేసి చెప్పి ఆట్టే నీ ఆఫీసుక్కూడా ఎల్లి వాల్లకి కూడా నీ కథంతా తెలియజెప్పుతానంటోంది" పట్టరాని కోపంతో చెప్పాడు పుల్లయ్య.

"వద్దు పుల్లయ్యా! వద్దు. అంతపని చేయకండి. కనబడ్డ ప్రతి ఆడమనిషినీ తక్కువగా అంచనా వేసే నాకు తగు బుద్ది చెప్పి కళ్ళు తెరిపించారు. ఇక నన్నింతటితో వదిలి పెట్టండి" చేతులు జోడించి చెప్పి అతి కష్టంగా మంచం మీది నుంచి లేచి ప్యాంటు జేబులోంచి కొంత డబ్బు తీసి పుల్లయ్య చేతికివ్వబోయాడు.

"ఇదెందుకు? నీ కత ఎవ్వరికీ సెప్పొద్దని లంచంగా ఇస్తున్నావా" డబ్బందిస్తూన్న ఆ చేతిని వెనక్కి తోశాడు.

"మంచి మనుషుల మీద చెడ్డ తలంపు కలిగినందుకు సంతోషంగా ఒప్పుకుంటున్నాను తప్పు ఇది ఉచితం కాదు".

"ఇదేమిటయ్యా నీ డబ్బు. అది నీ దగ్గరే ఉంచుకో. కాకపోతే ఇక జీవితంలో ఇటువంటి తప్పుడు పని ఎప్పుడూ ఎక్కడా చేయకు. అయ్యవారి ఉద్యోగం అంటే అల్లాటప్పా ఉద్యోగం కాదు. ఎంతో గౌరవమయిన ఉద్యోగం. తెలిసిగాని, తెలియకగాని ఎవరేనా తప్పు చేస్తే సరిదిద్ది బుద్ధిమాటలు సెప్పి మంచిదారిని నడిపించినప్పుడే నిజమయిన బడిపంతులవుతావు" బడిపంతులుకే నీతి పాఠాలు చెప్పాడు చదువు సందెల్లేని పుల్లయ్య.

"చాలు పుల్లయ్యా! చాలు!! మీరు కూటికి పేదలయినా ఎంతో నీతి గల వాళ్ళని తెలిసిపోయింది. మీకున్న సంస్కారం నాకు లేకపోయింది. నాలాంటి చదువుకున్న వాడికన్నా మీరే గొప్ప బుద్ధిమంతులు. నీతిమంతులని తెలుసుకునేలా చేశారు. దయచేసి ఇక నా విషయం మాత్రం ఎక్కడా ఎవరికీ చెప్పకండి" మరొక్కసారి చేతులు జోడించి హీనస్వరంతో చెప్పి తలవొంచుకుని మెల్లిగా బయటికి నడుస్తూన్న నాగయ్యను చూసి "ఆగండయ్యా! ఆగండి. ఇపుడు టైమెంతయింది?" అని అడిగేడు పుల్లయ్య.

"పదిన్నర దాటింది" చెప్పాడు నాగయ్య మాష్టారు.

"ఈ సీకట్లో ఎక్కడికీ పోనఖ్ఖరలేదు. బయట మంచం మీద పడుకుని పొద్దుటే లేచెల్లండి" చెప్పిన పుల్లయ్య దొడ్డబుద్ధికి మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకుని అక్కడే బయట అరుగుమీద పడుకున్న నాగయ్య మాష్టారుకి రాత్రి నిద్రపట్టలేదు.

ఆ మరునాటి నుంచే సెలవుపెట్టి గుట్టు చప్పుడవకుండా మరో చోటికి బదిలీ చేయించుకు వెళ్ళిపోయాడు.

❃

